## క్లుప్తంగా

### వలంటీర్ల సేవలు ఉత్తమం



అవార్డులు అందుకున్న వలంటీర్లతో నేతలు

పెళ్లకూరు: వలంటీర్లు ప్రజలకు ఉన్నతమైన సేవలు అందిస్తున్నారని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శిరసనంబేడు, చెంబేడు, పునబాక సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. చెంబేడు వలంటీర్ ఎల్ పూర్ణిమకు సేవారత్న అవార్డు రూ.20 వేలు, సేవామిత్ర అవార్డులు దక్కించుకున్న 59 మంది వలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున వారి ఖాతాలో నగదు జమ అయినట్లు ఆయన చెప్పారు. ఎంపీఈఓ సురేష్‌బాబు, కార్యదర్శులు వసంత్‌కుమార్, యాస్మిన్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్, శ్రీనివాసులు, చంద్రబాబు, చంద్రయ్య, వెంకటరత్నం, కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్ వ్యవస్థ ఘనత సీఎం జగన్‌దే



వలంటీర్లను సన్మానిస్తున్న మండల ఎంపీపీ

సూళ్లూరుపేట రూరల్: రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందజేసి, సన్మానించారు. ఎంపీడీఓ ప్రమీలా రాణి పాల్గొన్నారు.

### ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



క్యాంప్‌ను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాసులురెడ్డి

వెంకటగిరి: ఆధార్‌క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని 23వ వార్డు కౌన్సిలర్ ఏ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆ వార్డు సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఆధార్‌క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం వార్డు సచివాలయాల్లోనే ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ అడ్మిన్ పీ గోపి, ఎడ్యుకేషన్ సెక్రటరీ పీ వెంకటేష్, వెల్ఫేర్ సెక్రటరీ షాలిని తదితరులు పాల్గొన్నారు.

### టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతానికి చర్యలు

వెంకటగిరి: టిడ్కో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. టిడ్కోగృహాలకు రుణాలు అందించి లబ్ధిదారులకు సహకారం అందించాలన్నారు.

### స్టాక్ పాయింట్ తనిఖీ



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న సుధీర్‌బాబు

కలువాయి: మండల కేంద్రంలోని జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌కు వచ్చిన సామగ్రి, వాటి నాణ్యతను పరిశీలించారు. మిగిలిన వస్తువులు కూడా త్వరలోనే వస్తాయని, వాటిని పాఠశాలల వారీగా విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలకృష్ణయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం జనార్దన రెడ్డి, సీఆర్పీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### గుంతలను వెంటనే పూడ్చాలి

గూడూరు: పట్టణంలో కొంతకాలంగా భూగర్భ గ్యాస్ పైప్‌లైన్ కోసం ఓ కంపెనీ వారు రోడ్లపై తవ్విన గుంతలను వెంటనే పూడ్చాలని ఇన్సాఫ్, సీపీఐ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో రోడ్లను తవ్వి పూడ్చకుండా వదిలేశారని, దీంతో పాదాచారులు, ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, ఇన్సాఫ్ ప్రతినిధులు జమాలుల్లా, ఇలియాజ్, హైదర్ అలీ తది తరులు పాల్గొన్నారు.

### నేడు మండల మీట్

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి):స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించనున్నట్లు బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ప్రగతి మణిహారం



చాగణం రహదారి



రాగనరామాపురం రహదారి

ప్రగతికి ప్రతిరూపం రహదారులే. ఇదే సదాశయంతో రాష్ట్ర ప్రభుత్వం రహదారుల పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఇందుకు అధిక మొత్తంలో నిధులు కేటాయించింది. దీంతో రోడ్ల పనులు కేవలం మూడు నెలల్లో పూర్తి అయ్యాయి. ఫలితంగా గ్రామీణుల రవాణాకు రాచమార్గం ఏర్పడింది. సైదాపురం మండలంలో కొత్తగా నిర్మించిన రోడ్ల నిర్మాణంపై కథనం.

- రూపుమారిన రహదారులు
- నాలుగు రోడ్లు అభివృద్ధికి రూ.9 కోట్లు మంజూరు
- శరవేగంగా పనులు పూర్తి

సైదాపురం: మండలంలో నాలుగు కొత్త రోడ్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో చాగణం ఎన్‌పీఎస్ రహదారికి రూ.5.95 కోట్లు, జీఆర్ రోడ్డు నుంచి రాగనరామాపురం రోడ్డుకు రూ.1.24 కోట్లు, ఆర్అండ్‌బీ రహదారి నుంచి పాలూరు వరకు దారికి రూ.89 లక్షలు, ఊటుకూరు నుంచి ఆదూరుపల్లె వరకు ఉన్న రోడ్డు పునర్నిర్మాణానికి రూ.1.35 కోట్లను కేటాయించింది. ఏఐబీ, పీఎం జీఎస్‌వై పథకం ద్వారా ఈ నిధులను కేటాయించగా పనులు చేపట్టి కేవలం మూడు నెలల్లో రోడ్ల పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. రోడ్ల నిర్మాణంతో సైదాపురం మండల ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారం అయ్యింది. గతంలో దెబ్బతిన్న రహదారులపై ప్రయాణ సాగించలేక నానా ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవస్థలు తొలగిపోయాయి. దీంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**త్వరలోనే ప్రారంభం**



ఈ రోడ్ల పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మూడు నెలల్లోనే రహదారుల పనులను పూర్తి చేయడం విశేషం. త్వరలోనే ఈ రహదారులను ప్రారంభిస్తాం. గ్రామీణ ప్రాంత ప్రజల కల నెరవేరింది.

– మవేక్‌రెడ్డి, ప్రత్యేక ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

**టీడీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదు**



దారుణంగా మారిన రహదారుల ఆధునికీరణ గురించి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ విషయమై నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, నిధులు మంజూరు చేయించారు. పనులు కూడా పూర్తి చేసి ఈ రహదారులు సుందరంగా తీర్చిదిద్దారు.

– గుంటమడుగు శ్రీనివాసులురాజు, స్థానికుడు

**అభివృద్ధిలో చరిత్ర**



అనవాళ్లు కోల్పోయిన రోడ్లను టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి, ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయడం చాలా సంతోషం. అభివృద్ధిలో ఈ ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోంది.

–మన్నారపు రవికుమార్ యాదవ్, జేసీఎస్ కన్వీనర్, సైదాపురం

# వలంటీర్లు ప్రభుత్వానికి..ప్రజలకు వారధులు



సన్మానం అందుకున్న వలంటీర్లతో నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి

కలువాయి: వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులని వెంకటగిరి నియజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి ఉమామహేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. సంక్షేమ పథకాలను అందించడంలో అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు పనిచేస్తూ ఆదర్శనీయంగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన పేదలు, వలంటీర్లను తమ కుటుంబసభ్యులుగా చూస్తున్నారన్నారు. అనంతరం మండలంలో సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రకు ఎంపికైన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు పంగా పెంచల నరసారెడ్డి, సర్పంచ్ దేచూరు పెంచలమ్మ, పీఏసీఎస్ చైర్మన్ చల్లా సుబ్బరామిరెడ్డి, ఏఎబీ చైర్మన్ చల్లా రఘురామిరెడ్డి, ఈఓపీఆర్డీ నారాయణ, నాయకులు మేకపాటి వెంకటనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం**



రాపూరు: లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రెండు కళ్లుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు సచివాలయం 2 పరిధిలోని రామిరెడ్డిపల్లె, నవాబుపేటలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, నాయకులు పాపకన్ను దయాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నేమళ్లపూడి సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కలపాటి మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, మునేంద్ర, తహశీల్దార్ సుభాషిణి, ఎంపీడీఓ వీర్రాజులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా పథకాలు



కోట: సిద్ధవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కర్లపూడి, సిద్ధవరం, దొరువుకట్ట గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. సిద్ధవరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్నారన్నారు. ఈ నాలుగేళ్లలోనూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న సంక్షేమ పథకాల అమలులో ఎక్కడ ముఖ్యమంత్రి వెనకడుగు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, దువ్వూరు రాజగోపాల్‌రెడ్డి, ధవకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

**మార్కెట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి**



గూడూరు: మార్కెట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పట్టణంలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌ను పిలిచి పనులన్నీ ఎప్పటిలో గా పూర్తవుతాయని అడిగి తెలుసుకున్నారు. పనులు పెండింగ్ ఉంటే త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్‌ను ఆయన ఆదేశించారు. త్వరలో మార్కెట్ ప్రారంబిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నం మురళి, ముస్లిం మైనార్టీ నాయకులు అజీజ్‌ఖాన్, కటకం శీనయ్య, రత్నయ్య, జగదీష్, తదితరులు ఉన్నారు.

### పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామయ్య

వెంకటగిరి: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షిస్తూ ముందుకు సాగితేనే భవిష్యత్ తరాలకు మనుగడ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వార్డు సచివాలయ సిబ్బందితో జీవ వైవిధ్య పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్య ప్రాముఖ్యతపై క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచేలా ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహించనుందన్నారు. జీవవైవిధ్యాన్ని సుస్థిర విధానాల్లో వినియోగించుకోవడం, దాన్ని సంరక్షించుకోవడం అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

### ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి



వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ సిరాజ్‌బాషా, బోర్డు సభ్యుడు తాజుద్దీన్‌లను సత్కరిస్తున్న మసీదు సభ్యులు

వెంకటగిరి: ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ సిరాజ్‌బాషా తెలిపారు. పట్టణంలోని 7వ వార్డు హబీబా మసీదును మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు సిరాజ్‌బాషాను సత్కరించారు. మసీదుకు సంబంధించి పలు అంశాలను ముస్లింలు, మతపెద్దలు వక్ఫ్‌బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. వక్ఫ్‌బోర్డు జిల్లా సభ్యుడు పఠాన్ తాజుద్దీన్, మున్నా పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థతో పల్లె ముంగిటకే సేవలు



చేనిగుంటలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

తడ: సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పల్లె సీమలకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం చేనిగుంట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి సంక్షేమ ఫలాల గురించి వివరిస్తూ, బుక్‌లెట్లను అందిస్తూ, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ గతంలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం రోజుల తరబడి వ్యవ ప్రయాసల కోర్చి కార్యాలయాల చుట్టూ తిరిగి తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలకు ఊహించని విధంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ వారి ఇంటి ముంగిటికే వచ్చాయన్నారు. చేనిగుంట గ్రామంలో దళితులు నీటి సమస్య గురించి ఎమ్మెల్యేకి విన్నవించడంతో స్పందించిన ఆయన ప్రస్తు తం తాత్కాలికంగా సమస్యను పరిష్కరించి, మూ డు నెలల్లో శాశ్వత పరిష్కారం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కే రఘురెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, ఏఎబీ జిల్లా సభ్యుడు మారంరెడ్డి మునీష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మాధుర్య, నాయకులు టీ రవిరెడ్డి, కే ఆర్ముగం, కే వాసుమొదలి, కే శేఖర్‌బాబు, ఉచ్చూరు మునుస్వామిరెడ్డి, పాలా మహేశ్వర్, బీ జయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఏపీజీబీ సేవా కేంద్రం ఏర్పాటు



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: పొదుపు సంఘాల మహిళలకు సౌకర్యవంతంగా గూడూరులోని మండల సమాఖ్య కార్యాయలంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్(ఏపీజీబీ)సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆర్డీఓ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీజీబీ వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆర్డీఓ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు సంబంధించి 11 రకాల సేవలు ఈ కేంద్రంలో లభిస్తాయని, బ్యాంక్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. మహిళలందరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డివిజన్ వ్యాప్తంగా ఇలాంటి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.లీలారాణి, రీజినల్ మేనేజర్ శైలేంద్రనాథ్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, రాజేష్, దివ్యతేజ పాల్గొన్నారు.

# వాడవాడలా చెంగాళమ్మకు అంబళ్లు



పరమేశ్వరి నగర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

సూళ్లూరుపేట: పట్టణంలోని వాడవాడలా చెంగాళమ్మకు అంబళ్లు పోసే కార్యక్రమాన్ని సంబరంలా నిర్వహిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని పరమేశ్వరినగర్, గాండ్లవీధి, బాపూజీకాలనీ, కస్వారెడ్డిపాళెం ప్రాంతాల్లో చెంగాళమ్మకు అంబళ్లు పోసి, పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అంబళ్లతో ఊరేగింపుగా నాలుగురోడ్లు కూడళ్ల వరకు వెళ్లి, అక్కడ అమ్మవారికి పూజలు చేసి, అంబళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి పాల్గొని పూజలు చేసి అందరికీ అంబలిని పంపిణీ చేశారు. మంగళవారంతో అంబళ్లు పోసే కార్యక్రమం ముగిసింది. ఈనెల 26న శుక్రవారం అమ్మవారి బ్రహ్మోత్సవాలకు మొదటి చాటింపు వేయనున్నారు.

# వైఎస్ రాజారెడ్డికి నివాళి



వైఎస్ రాజారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

వెంకటగిరి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు మంగళవారం పాళెంకోటరోడ్డు సెంటర్‌లో రాజారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాజారెడ్డి అభిమాని మంగళపురి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజారెడ్డికి వెంకటగిరితో మంచి అనుబంధం ఉందన్నారు. వెంకటగిరి, బాలాయపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పెద్దాయన సేవలు మరువలేనివని వారు కొనియాడారు. అనంతరం నాయకులు స్థానికులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాజారెడ్డి అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు



మాట్లాడుతున్న డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి

గూడూరురూరల్: విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం అమలు చేసిందని డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. గూడూరులోని ఎమ్మార్సీలో వివిధ మండలాల ఎంఈఓలతో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో ఇంటర్, పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే, ఆర్డీఓ చేతుల మీదుగా రూ.15 వేలు, రూ.10, వేలు రూ.5వేలు వంతున నగదు ప్రోత్సాహకాలతోపాటు ప్రశంసా పత్రాలు అందించి, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లను సత్కరించనున్నట్లు తెలిపారు.

# టీడీపీ సిలికా నిరసనకు జనం కరువు



స్థానికులు లేకుండా సిలికా డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు : 'సిలికా అక్రమంగా తవ్వేస్తున్నారు.. రూ.కోట్లు దోచేస్తున్నారు' అని అసత్య ఆరోపణలు చేస్తూ.. టీడీపీ నాయకులు చేపట్టిన నిరసనను ప్రజలు తిప్పికొట్టారు. కనీసం సొంత పార్టీ కార్యకర్తలు కూడా రాకపోవడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు హతాశులయ్యారు. చివరికి నలుగురు విలేకరులను పిలిచి, వైఎస్సార్‌సీపీ నేతలపై అక్కసు వెళ్లగక్కి ఇళ్లకెళ్లిపోయారు. సోమవారం చిల్లకూరు ప్రాంతంలో టీడీపీ నేతలకు ఎదురైన చేదు అనుభవమిది. జిల్లాలో సిలికా తవ్వకాల్లో అక్రమాలు జరిగాయని, ఆ ప్రాంతాలను సందర్శించి నిరసన తెలపాలని టీడీపీ నాయకులు పెద్ద ప్రణాళికే వేశారు. భారీ ప్రచారం చేయడంతో స్థానికుల నుంచి స్పందన బాగా ఉంటుందని అనుకున్నారు. నాయకులు, వారు వచ్చిన వాహనాల్లోని వారు తప్ప జనాలెవరూ రాలేదు. కనీసం టీడీపీ కార్యకర్తలు కూడా రాలేదు. నిరసనకు రాబోమని చెప్పారు. స్థానికులు రాక పోవడంతో గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి రప్పించుకున్న కొద్ది మంది ద్వితీయ శ్రేణి నాయకులతో నిరసన కార్యక్రమం మమ అనిపించారు.

### మెరుగైన సేవలు అందించండి

రాపూరు: గ్రామాల్లోని ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని వేపినాపి పీహెచ్‌సీ వైద్యుడు సూర్యధర్మేంద్ర తెలిపారు. పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయని, 10 గంటల తరువాత ఎవరూ బయట తిరగవద్దని, అధికంగా మంచినీరు, మజ్జిగ తీసుకోవాలని సూచించాలని చెప్పారు.

### 2న యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గూడూరు: పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులకు జూన్ 2వ తేదీన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు వైఈపీఏ గౌరవ సలహాదారు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ తెలిపారు. నెల్లూరు విజయమహల్ గేట్ వద్ద ఉన్న ఎంఎస్‌ఎస్ కల్యాణ మండపంలో యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 500 పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, తదితరుల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందిస్తారని చెప్పారు. గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట డివిజన్లలోని యాదవ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలు 99486 06664 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.